విద్యలో విప్లవాత్మక మార్పులు

- సీఎం జగన్ కృషితో ఎంతో మేలు
- ఎంపీ వంగా గీత
- వేడుకగా జగనన్న ఆణిముత్యాలు
- విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గడచిన నాలుగేళ్లలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి నగదు పురస్కారాలను అందజేశారు. 10వ తరగతిలో మొదటి మూడుస్థానాల్లో నిలచిన వారికి రూ.15వేలు, 10వేలు, 7 వేలు చొప్పున, ఇంటర్‌లో బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ టాపర్లకు రూ.15వేలు చొప్పున నగదుతో పాటు మెడల్, సరిఫికెట్ అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది తల్లిదండ్రులను కూడా సత్కరించారు. ఎంపీ గీత మాట్లాడుతూ తల్లిదండ్రులపై ఆర్థికభారం లేకుండా ప్రభుత్వమే ఎన్నో పథకాలను అమలు చేస్తూ తోడ్పడుతోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంలో సీఎం ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, గృహనిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా ఏ మాత్రం రాజీపడకుండా విద్యావ్యవస్థకు మెరుగులు దిద్దారన్నారు.

భావి తరాలను దృష్టిలో ఉంచుకుని సీఎం సమర్థవంతమైన పథకాలను అందించారన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎల్.గణేష్, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, నల్లబెల్లి సుజాత, సంగాని నందం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి పురస్కారం, సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు


దడాల జ్యోత్స్నకు పతకం వేసి సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకు పోటీ

కాకినాడ రూరల్: ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. జగనన్న ఆణిముత్యాల పేరిట పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో టాపర్లను సన్మానించి, వారికి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని గురువారం మండలంలోని పి.వెంకటాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలిక గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్యఅతిథిగా హాజరై పదో తరగతి టాపర్లుగా నిలిచిన గురుకుల పాఠశాల విద్యార్థిని దడాల జ్యోత్స్న (589), పండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొల్లపల్లి లక్ష్మీ దుర్గ (582), తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శేరు ప్రియ రత్న గాయత్రి (580) లను సన్మానించి, నగదు ప్రోత్సాహాన్ని అందించారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్స్ గరల్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని (ఎంపీసీ) పి.సుగుణ (956), ఇదే జూనియర్ కళాశాలలో బైపీసీ నుంచి 944మార్కులు సాధించిన ఎస్.శ్యామల, హెచ్ఈసీలో 588మార్కులు సాధించిన వేలంగి జూనియర్ కళాశాలకు చెందిన జి.సునంద, సీఈసీలో 889 మార్కులు సాధించిన ఎస్.రాజేశ్వరిలను వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే కన్నబాబు సత్కరించి ప్రోత్సాహకం అందించారు. కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారన్నారు. ఇంగ్లిషు మీడియంతో పాటు ఆధునిక హంగులతో పాఠశాలలను తీర్చిదిద్ది, జగనన్న విద్యా కానుక కిట్లు మొదలుకొని మధ్యాహ్నం భోజనం సహా నాణ్యతతో అందిస్తున్నారన్నారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, గోపుశెట్టి బాబ్జీ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, ప్రిన్సిపాల్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా చర్యలు

ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: రెవెన్యూ సేవలు, అర్జీలు పరిష్కారంలో నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష, రీ సర్వే ప్రక్రియలో మొదటి దశలో 113 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. రెండో దశ రీ సర్వేకి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యంగా జగనన్నకి చెబుదాం స్పందన ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చే దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ ఏడీబీ రోడ్డు విస్తరణకు చేపట్టిన భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. రైతుల కౌలు హక్కు పత్రాలు సిద్ధం చేయాలని తదితర అంశాలపై తీసుకోవలసిన చర్యలపై ఆర్డీవో సత్యనారాయణ ఆదేశించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

ఉష్ణోగ్రతల పెరుగుదల మానవాళికి ప్రమాదం

బోట్‌క్లబ్: ఇటీవలి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం మానవ మనుగడకు ప్రశ్నార్థకంగా మారిందని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ అన్నారు. ఉష్ణోగ్రతలు ఇలా కొనసాగితే జీవరాశులు సైతం నశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక రోటరీక్లబ్‌లో గురువారం రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో ఇన్‌పాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజెస్ కాజెస్ అండ్ కాన్సిక్వెన్సెస్ అనే అంశంపై ప్రసంగించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల జన జీవనం అస్తవ్యస్తమై గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలన్నారు. రోటరీ వంటి అంతర్జాతీయ సేవా సంస్థలు పర్యావరణంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు, క్లబ్ కార్యదర్శి ఆదిత్య, బ్లడ్‌బ్యాంకు చైర్మన్ బాలకృష్ణ, సభ్యుడు చార్మినార్ వర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ శ్రీనివాస్

విద్యార్థులకు ఐరన్ మాత్రలు విధిగా ఇవ్వాలి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ ఆర్.రమేష్ గురువారం సందర్శించారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా అందించే వేరుసెనగ చిక్కీలు విద్యార్థులు తినేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్‌లో ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఆరోగ్యంపై తీసుకోవలసిన చర్యలను ఉపాధ్యాయులకు వివరించారు. హైస్కూల్ హెచ్‌ఎం పుల్లయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యవతి, ఏఎన్‌ఎం విద్య, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ రమేష్

సమాజాన్ని ప్రభావితం చేసేవే నాటికలు

కాకినాడ కల్చరల్: నాటికలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ది యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులగా జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం అసోసియేషన్ చేస్తున్న కళా సేవలను సీపోర్టు ఉన్నతాధికారి ఎం.మురళీధర్ కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తానని అసోసియేషన్ కన్వీనర్ ఎన్.ప్రభుదాస్ అన్నారు. అనంతరం తెలుగు కళాసమితి (విశాఖపట్టణం) సమర్పణలో చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక ఆలోచింప చేసింది. నేటి ఆధునిక సమాజంలో అక్రమ సంబంధాలు కారణంగా ఎన్ని కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయో, ఎంత మంది చిన్నారులు అనాదరణకు గురై రోడ్డున పడుతున్నారో ప్రదర్శించారు. తదుపరి రసఝరి సంస్థ (పొన్నూరు) సమర్పణలో వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించి 'కాపలా' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకొంది. సమాజంలో ఉన్నత వ్యక్తులకు, వ్యవస్థలకు ఎంతటి కాపలా ఏర్పాటు చేసినా జరిగే నష్టం జరుగుతూనే ఉందనే అంశంపై నాటక సాగింది. అనంతరం నటుడు, దర్శకులు వైఎస్ కృష్ణేశ్వరరావును ఘనంగా సత్కరించారు. చెలికాని స్టాలిన్, అసోసియేషన్ కన్వీనర్లు ఎన్.ప్రభుదాస్, కె.కృష్ణారావు, నాగిరెడ్డి, చింతపల్లి సుబ్బారావు, జానకీరామ్ చౌదరి పాల్గొన్నారు.


నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో ఒక సన్నివేశం

నాలుగేళ్లుగా సంక్షేమంతో ఆదుకుంటున్నాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నడకుదురులో గడప గడపకూ..

కరప: ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు, సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా వాటిని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా నడకుదురులో గురువారం సాయంత్రం ఇంటింటికీ పర్యటించారు. సచివాలయం-1 పరిధిలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను కలసి వారు పొందిన లబ్ధిని వివరించి అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి

కాకినాడ: స్మార్ట్‌సిటీ పథకంలో చేపట్టి వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమై నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఆయా పనులు సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాగా నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. తొలుత జంతుహింసనివారణ సంఘ ప్రాంతాన్ని, ప్రతాప్‌నగర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు కెనాల్‌కు ఇరువైపులా జరుగుతున్న ఆధునీకరణ పనులను, సాలిపేట బాలికోన్నత పాఠశాలను సందర్శించారు.

ఇష్టమైన కస్టమ్


మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల కస్టమైజ్ గిఫ్ట్‌లు

- పురాతన సంప్రదాయమే నయా ట్రెండ్
- అతిథులను ఆకట్టుకుంటున్న బహుమతులు

బోట్‌క్లబ్: బంధువులు, స్నేహితులకు బహుమతులు ఇవ్వాల్సి వస్తే గతంలో గృహాలంకరణ వస్తువులు ఇచ్చేవారు. నేడు ట్రెండ్ మారింది. బహుమతి స్వీకరించేవారి ఫొటోనే బహూకరిస్తున్నారు. నిజానికి ఈ సంప్రదాయం పురాతనమైనదే. రాజరికాల కాలంలో ఒక దేశం నుంచి ఇంకొక దేశానికి అతిథిగా వెళ్లే రాజులు ఆ దేశ యువరాజో, లేదా యువరాణి చిత్రాన్నో పావురం, లేదా మరో రకమైన కుంచెతో ఏ పత్రంమీదో చిత్రించి వారి మనసు చూరగొనేవారు. ట్రెండ్ మారడమంటే గత సంస్కృతి మళ్లీ పునరావృతం కావడమే. ఇటువంటి కస్టమైజ్ గిఫ్ట్‌లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఏర్పడింది. వీటిలో రకరకాలు అందుబాటులో ఉన్నాయి. తలగడలపైనా, టీ కప్పుపైనా, గోడకు తగిలించుకునేలా రకరకాలుగా బహుమతులు ఇచ్చేలా కొత్త ట్రెండ్ ప్రస్తుతం సాగుతోంది.


ఉడ్ కార్వింగ్‌పై ఫొటోలతో బహుమతులు

కంప్యూటర్ ప్రింటింగ్‌తో నాణ్యత

ఎవరికి బహుమతి ఇవ్వాలనుకుంటున్నామో వారి ఫొటో దుకాణదారుకు ఇస్తే కంప్యూటర్‌లో దానిని నిక్షిప్తం చేసి ఏ బహుమతి ఎంచుకున్నామో దానిపై చక్కని రిజల్యూషన్‌తో ఆకర్షణీయంగా డిజైన్ చేసి ఇస్తున్నారు.

రెండేళ్ల క్రితం నష్టాలతో

నగరంలో వివిధ ప్రాంతాల్లో కస్టమైజ్ గిఫ్ట్ షాపులు వచ్చినప్పటికీ కరోనా వల్ల గత రెండేళ్లుగా వ్యాపారం అంతగా లాభించలేదు. ఏ ఇంట చూసినా శుభ కార్యాలు ఎవరినీ పిలవకుండా ఇళ్లలోనే చేసుకునేవారు.

ప్రస్తుతం ఎంతో బాగు..



కరోనా కాలం ముగిసింది. జన జీవనం మామూలైంది. కొద్ది నెలలుగా వ్యాపారం చురుగ్గా సాగుతోంది. బహుమతులకు ఆర్డర్లు బాగానే వస్తున్నాయి. దీంతో బేరాలు బాగా వస్తున్నాయి. ఆన్‌లైన్ వారికి కావాల్సిన గిఫ్ట్‌లు పంపే ఏర్పాట్లు చేశాం.

సాయి, కస్టమైజ్ గిఫ్ట్ షాపు నిర్వాహకుడు

బహుమతులుగా బాగుంటున్నాయి



ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన కస్టమైజ్ గిఫ్ట్‌లు బంధువులు, స్నేహితులకు ఇచ్చేందుకు ఎంతో బాగుంటున్నాయి. మనం ఇచ్చే బహుమతిని చూసి వారు చాలా ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు. మనకు కావాల్సిన రేటులో కూడా మనకు కస్టమైజ్ గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

అంకంరెడ్డి రాముసాయుడు, కొనుగోలుదారుడు

విద్యాదీవెన కిట్ల పంపిణీ


విద్యాదీవెన కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: స్థానిక శ్రీనగర్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 10 వేల మందికి వీటిని అందజేశారు. అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎల్.గణేష్‌బాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీల శిక్షణ ప్రారంభం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఐదో బ్యాచ్ జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈటీసీ ప్రిన్సిపాల్ జె వేణు గోపాల్ ఈ శిక్షణ ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన 35 మంది హాజరు కావలసి ఉండగా 17 మంది మాత్రమే హాజరయ్యారు.

క్లుప్తంగా

వృద్ధులను ఆదరించాలి


రమణయ్యపేటలో సీనియర్ సిటిజన్ల ర్యాలీ

కాకినాడ రూరల్: పెంచి, పోషించి, విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులను ఆదరించాలని కోరుతూ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గురువారం ర్యాలీ నిర్వహించింది. అంతర్జాతీయ వృద్ధుల వేధింపుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఈ ర్యాలీ సాగింది. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వేధించకుండా వారిని అక్కున చేర్చుకుని ఆదరించడం ద్వారా వారు జీవిత చరమాంకంలో శేష జీవితాన్ని సంతోషంగా గడుపుతారన్నారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం సాయిమోహన్, ప్రసాదరావు

కరప: మండలం గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సోషల్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు ఆ సబ్జెక్టుపై తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ అందజేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు చదివి గుర్తుంచుకునేలా ఈ మెటీరియల్ తయారు చేసినట్టు తెలిపారు. ఆయన 58వ పుట్టినరోజు కావడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

కాకినాడ డీఎల్‌పీఓగా అన్నామణి



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ డీఎల్‌పీఓగా టి.అన్నామణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎల్‌పీఓగా పనిచేస్తున్న వై.అమ్మాజీ పశ్చిమ గోదావరి జిల్లా బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఏలూరు డీఎల్‌పీఓగా పనిచేస్తున్న అన్నామణి నియమించారు. బాధ్యతలు స్వీకరించిన డీఎల్‌పీఓను పంచాయతీ కార్యదర్శులు సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు.

పేటకాలువ పూడికతీత


రమణయ్యపేటలో పూడిక తీస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: వర్షాకాలం సమీపిస్తుండడంతో రమణయ్యపేటని పేట కాల్వ పూడిక తీత పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీ డ్రైనేజీ నుంచి రాజీవ్ గాంధీ లా కళాశాల వరకు గల పేట కాల్వలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సిబ్బంది పర్యవేక్షణలో పూడిక తీస్తున్నారు.

జీతాలు, బిల్లులు చెల్లించాలి

కాకినాడ సిటీ: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లకు బకాయి వేతనాలు తక్షణం మంజూరు చేయాలని, పెండింగ్ అద్దెలు చెల్లించాలని కోరుతూ గురువారం కాకినాడ డైరీఫారం సెంటర్ సమీపంలోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. యూనియన్ నాయకులు ఎం.రమణమ్మ, ఎంకే జ్యోతి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

కరప: వచ్చే నెల పదో తేదీ అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గురువారం కరపలో నిర్వహించిన ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అన్నదాన సమాజం ఈఓగా చందన

బోట్‌క్లబ్: స్థానిక సినిమా రోడ్డులోని కోకనాడ అన్నదాన సమాజం ఈఓగా ఆర్.చందన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న శివబాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చందనను నియమించారు. అన్నదాన సమాజం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పశ్చిమగోదావరి జిల్లాలోని కోట సత్తెమ్మ ఆలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సమాజంలో వీడ్కోలు సభ నిర్వహించి శ్రీనివాస్‌ను సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు.

టెండర్లు ఖరారు

బోట్‌క్లబ్: స్థానిక పెద్దమార్కెట్‌లోని బంగారు చిన శోభనాద్రి సత్రంలో విద్యార్థులకు నిర్వహించే అన్నదానం కోసం కూరగాయలు, కిరాణా, పెరుగు, బియ్యం సరఫరాకు టెండర్లు ఖరారయ్యాయి. గురువారం దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్‌లో తక్కువ కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేసినట్లు ఈఓ అడబాల శ్రీనివాస్ తెలిపారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ రూరల్: రమణయ్యపేట – సర్పవరం గ్రామాల మధ్య నరసాల డ్రైనేజీ, పుంత కాల్వను ఆక్రమించుకుని గ్రావెల్‌తో మెరక చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం రైతులు డిమాండ్ చేశారు. సర్పవరం గ్రామానికి చెందిన రైతులు దేవిశెట్టి సత్తిబాబు, మారెళ్ల సత్యనారాయణ, నడిశెట్టి సూర్యచంద్రరావు తదితరులు ఆక్రమణకు గురువుతున్న స్థలం వద్ద గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ కోసం ఆక్రమణకు పాల్పడుతున్నారని దీనిపై జిల్లా కలెక్టరుకు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దారుకు స్పందన ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

రోగులు, ఆరోగ్య సిబ్బంది భద్రతపై సదస్సు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద ట్రస్ట్ ఆస్పత్రిలో బీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రోగులు, ఆరోగ్య సిబ్బంది భద్రతపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. బుధ, గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టరు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టరు ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఇంట్లో కుటుంబ సభ్యులు చూపించే ప్రేమను ఆస్పత్రిలో రోగులు పట్ల చూపించగలిగితే వారిని జీవితాంతం గుర్తుంచుకుంటున్నారన్నారు. బీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ట్రైనర్ డాక్టరు కుషాల్ జోషి, నర్సింగ్ సూపరింటెండెంట్ మహాలక్ష్మి, హెచ్ఆర్ మేనేజరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పళ్లెం సమర్పణ


ఈఓకు వెండి పళ్లేన్ని అందిస్తున్న దాత సత్తిబాబు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలా త్రిపుర సుందరి అమ్మవారికి నిత్యపూజల్లో ఉపయోగించుకునేందుకు నగరానికి చెందిన సోమాదుల సత్తిబాబు వెండి పళ్లెం సమర్పించారు. సుమారు 510 గ్రాముల బరువుగల వెండి పళ్లేన్ని ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డికి గురువారం అందించారు. దీని విలువ రూ. 40 వేలు ఉంటుందని ఈఓ తెలిపారు.

డిమాండ్ల పరిష్కారానికి 19న ధర్నా

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): తమ డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 19న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద ధర్నా చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి పెంకె సత్యనారాయణ తెలిపారు. డీసీసీబీ కార్యాలయంలో సీఈఓ ఆర్‌వీ నరసింహారావుకు గురువారం ధర్నా నోటీసు అందించారు. రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జయరాం, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసరాజు, కోశాధికారి అప్పలరాజు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, కోశాధికారి జి.సుధాకర్ వర్మ పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

కాకినాడ: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సుమారు 40 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారని, వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయు నగరాధ్యక్షుడు పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఇటీవల కేబినెట్ తీసుకున్న నిర్ణయం వల్ల కొద్దిమందికే ప్రయోజనం కలుగుతుందని, అందరికీ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు జలగడుగుల శ్రీనివాస్, బవిరిశెట్టి గురుమూర్తి, దానయ్య, నక్కా సత్యనారాయణ తదితరులు డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

పీఈటీలకు సమ్మర్‌కోర్సు పునరుద్ధరణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): గత 20 ఏళ్లుగా సమ్మర్‌కోర్స్ ద్వారా బీపీఈడీ చేసుకునే అవకాశం కోసం పీఈటీలు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఏపీపీఈటీ, పీడీ అసోసియేషన్ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి సమ్మర్ కోర్సు పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమ్మర్ కోర్సు పునరుద్ధరిస్తూ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 మంది పీఈటీలు ఈ కోర్సు ద్వారా బీపీఈడీ చేసుకునే అవకాశం కలిగిందని రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి తెలిపారు.